ఉద్యాన పంటల నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో షెడ్యూల్ కులాల సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ విద్యార్థులకు జీవనోపాధికి అసరమైన ఉద్యాన పంటల నైపుణ్యాభివృద్ధి పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో ఉద్యాన పంటలైన పండ్లు, అలంకరణ మొక్కలు అంటుకట్టడం, కొత్తగా నర్సరీలు ఏ విధంగా ఏర్పాటు చేసుకోవడం వంటి మెలకువలను శిక్షణలో విద్యార్థులకు వివరించారు. శిక్షణలో కళాశాల డీన్ ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటుగా ఉద్యాన పంటలపై నైపుణ్య అభివృద్ధిని పెంచుకుంటే సుస్థిరమైన ఆర్థిక ప్రగతితో పాటు పదిమందికి జీవనోపాధిని కల్పించవచ్చన్నారు. ఉద్యాన విద్యను అభ్యసిస్తునే విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎనుకోవాలని నర్సరీల ఏర్పాటు పై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కళాదర్ బాబు, డాక్టర్ మమత, కన్హశాంత వనం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ బి శివ, విశ్వవిద్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

శంషాబాద్: మున్సిపల్ వర్కర్లకు కనీస వేతనాలు రూ. 26 వేలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి. కిషన్ అన్నారు. పట్టణంలోని మహిళా మండలి కార్యాలయంలో బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందిని ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలపై యూనియన్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేష్, జయేందర్, యాదమ్మ, నీరటి మల్లేష్, ప్రవీణ్, రవి, సుజాత, శీను, నర్సింగ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక కార్యక్రమం

రాజేంద్రనగర్: ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పారిశుధ్యం నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌ను కలిసి ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శివరాంపల్లి ప్రశాంత్ కాలనీ, న్యూ వీకర్ సెక్షన్ కాలనీల్లో ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా పారిశుధ్య నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఆయా కాలనీల్లో చెత్త చెదారం, మట్టిదిబ్బలు, బండరాళ్లు ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయన్నారు. వెంటనే పారిశుధ్య పనులను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి.వెంకటేష్, ఉపాధ్యక్షులు డి.అంజనేయులు, రమాకాంత్, ఎం.శివ కుమార్, సిద్ధం శ్రీనివాస్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో బీజేపీ బస్సు యాత్ర



బస్సు యాత్ర సందర్భంగా బీజేపీ నాయకుల ప్రత్యేక సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ కోర్ కమిటీ సమావేశాన్ని బుధవారం అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ బీజేపీ బస్సుయాత్ర ఫిబ్రవరి నెలలో మొదలు కానున్న సందర్భంగా విజయవంతం చేయడానికి అసెంబ్లీ వారిగా యాత్ర కమిటీని ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ యాత్ర ప్రముఖ్‌గా పొన్నామోని మల్లేష్ యాదవ్, పబ్లిక్ మీటింగ్ ఇన్‌చార్జిగా డాక్టర్ ప్రేమ్‌రాజ్, జాయినింగ్స్ ఇన్‌చార్జిగా టి.అంజన్ కుమార్ గౌడ్, పబ్లిక్ మోబిలేషన్ ఇన్‌చార్జిగా తోకల శ్రీనివాస్ రెడ్డి, లీగల్ అండ్ పర్మిషన్ ఇన్‌చార్జిగా నారగూడెం మల్లారెడ్డి, కాన్వాయ్ అండ్ వెహికిల్స్ ఇన్‌చార్జి బుక్కా వేణుగోపాల్, వ్యవస్థ ఇన్‌చార్జిగా పంతంగి రాజు భూపాల్ గౌడ్, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సోల్కర్ రెడ్డి, ఈవెంట్స్ లోకల్ ఇష్యూస్ ఇన్‌చార్జిగా బుర్ర మహాలింగం గౌడ్, పబ్లిసిటీ ఇన్‌చార్జిగా కె.నరేందర్ రెడ్డిలను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంఏకు సన్మానం



బండ్లగూడ: డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.దివ్య ఐఏఎస్‌ను బుధవారం తెలంగాణ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఆమెకు పూలబొకే అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.కృష్ణమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి సాబెర్ అలీ, పి.శ్రీధర్ తదితరులున్నారు.

తుల్జారాం దేవాలయ అర్చకుడు మృతి



భజరంగ్ మహారాజ్ (ఫైల్)

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న తుల్జారాంభాగ్ దేవాలయం ప్రధాన అర్చకులు భజరంగ్ మహారాజ్ (80) బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఒకే సముదాయంలో అనేక దేవాలయాలను నిర్మించి భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించారు. కరోనా కష్ట కాలంలో ప్రతి రోజు 100 కేజీలకు పైగా ఆహారాన్ని పేదలకు అందించాడు. అతని సేవలను గుర్తించి మణికొండ మున్సిపాలిటీ తరపున ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. అలాంటి వ్యక్తి ఆకస్మాత్తుగా చనిపోవటంతో మున్సిపాలిటీ పరిధి ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి ఆయనకు అంతిమ నివాళులు అర్పించారు.

అటు వేశారు.. ఇటు మరిచారు..

- అసంపూర్తి రోడ్డుతో అవస్థలు
- శిల్పాపార్క్ మహర్షి విద్యామందిర్ రోడ్డు దుస్థితి



రెండు వాహనాలు వస్తే పాదచారులు నడవలేని పరిస్థితి

గచ్చిబౌలి: సగం రోడ్డు వేసి వదిలేయడం ఆ ప్రాంతవాసులకు శాపంగా మారింది. నిత్యం ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. వివరాలిలా.. చందానగర్ సర్కిల్–21 పరిధిలోని శిల్పాపార్క్‌లో మహర్షి విద్యామందిర్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు భావించారు. దాదాపు 500 మీటర్ల పొడవునా సిమెంట్ రోడ్డు వేసేందుకు రూ.90 లక్షల నిధులు కేటాయించారు. రోడ్డు నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. డ్రైనేజీ లైన్ వేసి మ్యాన్‌హోళ్లను సైతం ఏర్పాటు చేశారు. కాగా ఆ రోడ్డులో రెండు వరుసల సిమెంట్ రోడ్డును వేయాల్సి ఉంది. కాని సెప్టెంబర్‌లో ఒక వరుస సిమెంట్ రోడ్డు వేసి వదిలేశారు.

4 నెలలుగా నరకం..

సగం వేసిన సిమెంట్ రోడ్డుతో నాలుగు నెలలుగా శిల్పాపార్క్‌వాసులు నరకం అనుభవిస్తున్నారు. కాగా ఈ రోడ్డు చివర మహర్షి విద్యామందిర్ ఉంది. నిత్యం పాఠశాలకు ఉదయం, సాయంత్రం వేళలో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక రోడ్డుకు ఇరువైపులా ఉన్న అపార్ట్‌మెంట్ల నుంచి వాహనాలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. రెండు వాహనాలు ఎదురుపడితే ముందుకు వెళ్లేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు సగం వేసి వదిలేయంతో మిగిలిన రోడ్డులో ఉన్న మ్యాన్‌హోళ్లు నిత్యం పొంగిపొర్లుతున్నాయి. దీంతో మురుగు నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. సిమెంట్ రోడ్డులో వాహనాలు వెళుతుండగా మిగిలిన రోడ్డులో పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంది. 4 నెలలు గడుస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ స్పందించడం లేదని శిల్పాపార్క్ వాసులు తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నెలలు గడుస్తున్నా పనులు చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని శిల్పాపార్క్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. నవంబర్‌లో పూర్తి చేయాల్సిన పనులను ఇప్పటి వరకు పూర్తి చేయలేదని, సగం వేసిన రోడ్డును పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, చందానగర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామని, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని చందానగర్ సర్కిల్ ఈఈ శ్రీకాంతి తెలిపారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే

శిల్పాపార్క్‌లో మహర్షి విద్యామందిర్ వెళ్లే రోడ్డు పూర్తి చేసేలా చూస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. రోడ్డును సగం వేసి వదిలేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. కాంట్రాక్టర్ కారణంగానే రోడ్డు పనులు ఆగిపోయాయని, ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చర్చించానని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే కాంట్రాక్టర్‌ను మార్చి రోడ్డు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు.



శిల్పాపార్క్‌లో ఓవైపు సిమెంట్ రోడ్డు, మిగతా రోడ్డులో మురుగు



మహర్షి విద్యామందిర్‌కు వెళ్లే రోడ్డు

మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక నిలిపివేత



రామిరెడ్డి రాజేంద్రనగర్ మండల విద్యాధికారి

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు నిలిపివేయడం జరిగిందని రాజేంద్రనగర్ మండలం విద్యాధికారి (ఏఈఓ) డి.రామిరెడ్డి తెలిపారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ ప్రతి పాఠశాలలో, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు అనుసంధానంగా వ్యవహరిస్తూ పాఠశాల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ మేనేజ్‌మెంట్ కమిటీ సూచనలు చేయడంతో పాటు, ఉన్నత విద్యాశాఖ అధికారులకు తెలియజేస్తూ విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కరోనా నేపథ్యంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎంపిక చేయడం జరగలేదన్నారు. ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే ఎన్నికలు జరిగే అవకాశముందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామిరెడ్డి తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రగతి కాలనీలో పర్యటన



ప్రగతి కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ,జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు జీహెచ్ ఎంసీ అధికారులతో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు సరిగా వెలగకపోవడం వంటి సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలు ఏవైన ఉంటే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని కాలనీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, ధీరజ్ యాదవ్ ,రమోద్ జాదవ్, రవీందర్, పాండుయాదవ్, మధు, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను, జలమండలి సిబ్బంది లోకనాథ్, గణేష్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నిర్మూలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, (ఎంసీహెచ్) డాక్టర్ సృజన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ శివరాంపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనేమియా ముక్త్ భారత్ (రక్తహీనత లేని భారతదేశం) భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, రాజేంద్రనగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ, పీఓ (ఎంసీహెచ్) డాక్టర్ సృజనలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలు రక్తహీనతను నివారించడానికి ఆకుకూరలు, కూరగాయలతో పాటు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఐరన్ లోపంతో రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ స్వర్ణ కుమారి, శివరాంపల్లి జడ్పీహెచ్‌ఎస్ ప్రిన్సిపాల్ కిషన్‌తో పాటు బలరాం, శ్రీనివాస్, డాక్టర్ రేఖా, డాక్టర్ స్వాతి, డాక్టర్ వందన, డాక్టర్ జాఫర్, సిరాజుద్దీన్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ వాహనాల బహిరంగ వేలం

- వాహన యజమానులకు అభ్యంతరం ఉంటే పత్రాలు చూపించి తీసుకోవాలి

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన వివిధ రకాల వాహనాలను బహిరంగ వేలం వేయనున్నారు. సైబరాబాద్(మెట్రో పాలిటన్ ఏరియా) పోలీస్ యాక్ట్–2004 ఆర్/డబ్ల్యూ సెక్షన్ యూ/ఎస్ 6(2),7 ప్రకారం బహిరంగ వేలం వేయాలని నిర్ణయించారు. ఈ వాహనాలకు సంబంధించి యజమానులు ఆసక్తి, అభ్యంతరం ఉంటే నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరునెలల వ్యవధిలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో దరఖాస్తు చేసి తమ వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చు. లేని పక్షంలో వదిలివేయబడి/ క్లెయిమ్ చేయని వాహనాలను వేలం నిర్వహిస్తారు. వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయి. వీటి కోసం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ వీరలింగం ఫోన్ నెంబర్ 9490617317లో సంప్రదించాలి. మరిన్ని వివరాలకు సైబరాబాద్ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.in లో చూడొచ్చు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బండ్లగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోని ఎప్పటికప్పుడు పరిష్కారిస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో బోర్ మోటర్ చెడిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే అధికారులతో మాట్లాడి మరమ్మత్తు పనులను చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స

శేరిలింగంపల్లి: సిటిజన్స్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యబృందం అరుదైన శస్త్ర చికిత్స చేశారు.ఎడమ భుజంలో నిరంతర నొప్పి, వాపుతో బాధపడుతున్న 62 ఏళ్ళ మహిళకు ట్రాన్స్‌ఫార్మేటివ్ రివర్స్ షోల్డర్ ఆర్థోప్లాస్టీ విధానంతో చికిత్స చేశారు. భారతదేశంలో ఎక్కువగా కనిపిస్తోన్న ఆస్టియో ఆర్థరైటిస్ సమస్యతో రోగి ఎడమ భుజంలో నొప్పితో బాధపడుతున్నారని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వాసుదేవ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 9 శాతం మంది పురుషులు, 18 శాతం మంది మహిళలు ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారన్నారు.

విద్యార్థులకు మద్దతుగా సీపీఎం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం భూములను హైకోర్టు నూతన భవనాలకు కేటాయించవద్దని గత 16 రోజులుగా ధర్నా చేస్తున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మద్దతు తెలిపరు. బుధవారం రాత్రి వరకు కూడ విద్యార్థులు ధర్నాలో కూర్చోవడంతో వారితో పాటు పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో సీపీఎం పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉంటుందని, ప్రభుత్వం ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేద్దామని తెలిపారు. రైతు ప్రభుత్వం అన్ని చెపుకుంటున్న ప్రభుత్వాలు వ్యవసాయానికి అనుగుణంగా ఉన్న విశ్వవిద్యాలయాలను లేకుండ చేయడం చాల దారుమని అన్నారు.



విద్యార్థులతో కలిసి మానవహారంలో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి

నేడు నీటి సరఫరా బంద్

మణికొండ: ఖానాపూర్ రిజర్వాయర్ నుంచి మణికొండ మున్సిపాలిటీ వరకు జలమండలి నీటిని సరఫరా చేసే 1200 డయా పైప్‌లైన్ కోకాపేట వద్ద పగిలిపోయిందని అధికారులు తెలిపారు. దాంతో గురువారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పలు కాలనీలకు నీటి సరఫరా జరగదని, మరమ్మత్తులు పూర్తి కాగానే శుక్రవారం ఉదయం నుంచి యదావిధిగా నీటి సరఫరా జరుగుతుందని వారు పేర్కొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాళీమందిర్ ఫీడర్ పరిధిలో ఉ. 11 గం నుంచి మ.2 గంటల వరకు విద్యానగర్, శివపురి, శివ సాయినగర్, సంజీవగాంధీనగర్, గంధంగూడ, ఇండస్ వ్యాలీ, లిబ్ధమ్‌విల్లాస్, సంఘం సిటీ, బైరాగిగూడ, సన్‌సిటీ, గంధంగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కెకె-1, 2, పీల్ గుడ్ హోమ్స్, గంధంగూడ, సాయి బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. మరమ్మత్తుల కారణంగా ఈ కోత విధిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మణికొండ: నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెవన్‌హిల్స్, అల్లు స్టుడియో, స్టెండ్ మెడోస్, కృష్ణ గోశాల, పాలోమీ ఆట్రియా, ఈడెన్ పార్క్ విల్లాస్, అక్షయ పాత్ర, కోకాపేట గ్రామం, కోకాపేట పైప్‌లైన్ రోడ్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

- మణికొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పంచవటి కాలనీకి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, లాలమ్మగార్డెన్, తులిప్ గార్డెన్ కాలనీల పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. విద్యుత్ తీగలకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, బాసిత్‌బాబానగర్, జయశంకర్‌ల విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అదే విధంగా యూనివర్సిటీ, పహాడీ, చింతల్‌మెట్, సులేమాం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, శివరాంపల్లి, రాఘవేంద్ర కాలనీ, ఎన్టీఆర్, హసన్‌నగర్, బాబుల్‌రెడ్డినగర్, సాయిబాబానగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నిరుద్యోగ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

శంషాబాద్: గ్రామీణ, నిరుపేద, డ్రాప్‌అవుట్ విద్యారులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలతో పాటు ఉపాధి కల్పించే లక్ష్యంతో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ అనేక కోర్సులను నిర్వహిస్తుందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గత 15 సంవత్సరాలుగా మొత్తం 17వేల మందికి శిక్షణ అందించడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించామన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాంగణంలోని శిక్షణ కేంద్రంలో ఏసీ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఆటోమొబైల్, ఎక్స్‌వేటర్, ఆటోమొబైల్, డ్రైవాల్స్, ఫాల్స్ సీలింగ్ తదితర కోర్సులకు ఔత్సాహిక అభ్యర్థులను ఆహ్వానిస్తున్నామన్నారు. వీటితో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్ కోర్సులు కూడా ఉన్నాయన్నారు. ఈ కోర్సులకు ఈ నెల 26 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8985800102 నంబరును సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



శంషాబాద్ రూరల్: మండలంలోని చౌదరిగూడకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపదాస్ మున్సి సమక్షంలో వీరు పార్టీ తీర్థం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, నాయకులు కె.నరేందర్, అనిల్‌యాదవ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పార్కింగ్ విషయంలో గొడవ

అత్తాపూర్: తమ ఇంటి ముందు బైకులు పార్కు చేస్తూ తమకు ఇబ్బందుల కలిగిస్తున్నారంటూ అడిగినందుకు ఆ కుటుంబంపై కక్ష్య కట్టి ఎదురింటి కుటుంబ వాసులపై విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నందిముస్లాయిగూడ ప్రాంతానికి చెందిన యాస్మిన్ బేగం ఇంటి సమీపంలో నివసించే వారు తమ ద్విచక్ర వాహనాలను ఎదురింటి ముందు పార్కింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు మహమూద్ అలీ, షేక్ ఇబ్రహీంలపై దాడి చేసి పారిపోయారు. ఈ ఘటనలో ఇరువురికి తలలు, భుజాలు, చేతులపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గాయాల బారిన పడిన వారిని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంత్యక్రియలు పూర్తి

రాజేంద్రనగర్: ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన స్రవంతి, శేఖర్ మృతదేహాలకు బుధవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. మృతదేహాలను తీసుకొని కుటుంబ సభ్యులు తమ సొంత ఊరికి బయలుదేరారు. సాయంత్రం స్రవంతి, శేఖర్‌ల అంత్యక్రియలు పూర్తయినట్లు పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్య చేసుకున్న గదిలో పోలీసులు రెండు హిట్ బాటిళ్లు, కొన్ని మాత్రలు దంచి చుర్ణంగా చేసిన మిశ్రమాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నివేదిక వస్తే కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.